**వ్యవసాయం వ్యాపారం కాదనీ, అదొక జీవనవిధానమనీ, కష్టాలూ కన్నీళ్లూ చిన్న చిన్న అనుబంధాలతో కూడిన సమ్మేళనమనీ నమ్మిన నిన్నటి తరానికి చెందిన రైతు నేటి తరాన్ని చూసి విసిగి ఆశ్రమవాసానికి వెళ్లాలని చేసే ప్రయత్నాన్ని అతని నమ్మకాలే అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తే...**

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

# 6 లోపలి చొక్కా

చారి పి.ఎస్.





మజ్జిగలో సద్దన్నం పిసుక్కొని ఉల్లిగడ్డ నంజుకొంటూ కడుపు నిండా తాగి లేచాడు రామయ్య.

బైటకు నడిచి ఇంటిముందు అరుగుమీద కూచున్నాడు.

పక్క జేబులోంచి వక్క తీసి అటు ఇటు నోటితో వూది, పళుక్కున సగం కొరికి మిగతా సగాన్ని జేబులోకి జార్చి, ఆకు తీసి నోటబెట్టుకొని, సున్నపుకాయలోంచి కొద్దిగా సున్నాన్ని గోట తీసి నాలుక్కి రాసుకొన్నాడు. పొగాకు చెక్క మొద్దుల్ని నోట కొరికి దవడకు చేర్చాడు.

కోడలు దొడ్లో ఏదో పని చేసుకొంటూ వుంది.

మనవడు టౌను బడికి వెళ్లినట్టుంది.

మనవరాలు పలక మీద రాసుకొంటూ వుంది- వూర్లో బడికి సిద్ధ మవుతూ.

వక్కాకు నములుతూ ఆలోచనల్లో మునిగిపోయాడు రామయ్య.

దారిన వెళుతూ వున్న మనిషి పలకరించినా స్పందించలేదు.

కొంతసేపటికి ఆలోచనల్నించి తేరుకొని అరుగుమీంచి లేచాడు.

ఊపిరి గట్టిగా వదలుతూ, చేయి విదిలిస్తూ, 'అంతే...' అనుకొన్నాడు.

ఇంట్లోకి నడిచాడు.

గూట్లోని ఉతికిన బట్టల్ని కెలికితే పంచె, చొక్కా దొరికాయి.

ఒంటి మీది బట్టలు మాసిపోయి వున్నాయి.

ఉండేది రెండు జతలే.

కట్టుకొన్న పంచె విప్పి, ఉతికిన పంచెతో జతచేసి రెంటిని కలిపి కట్టుకొని గోచి చెక్కాడు. మాసిన చొక్కాపైన ఉతికిన చొక్కా తొడుక్కొన్నాడు.

లోపలిచొక్కా, పంచె బైటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు.

తువ్వాలు భుజానేసుకొన్నాడు.

అలమర గూటికి వేసి వున్న బీగం తీసి ఆధార్‌కార్డ్, భూమి పాస్ బుక్ వగైరాలు లోపలి చొక్కా జేబుల్లో పెట్టుకొన్నాడు. డబ్బు కూడా సర్దుకొన్నాడు.

కాళ్లకు చెప్పులేసికొని బైటకు కదిలాడు.

రాస్తోన్న పలకను పక్కనబెట్టి లేచి అతనికి అడ్డంగా నిలబడింది మనవరాలు.

"అబ్బా! అబ్బా! నేనొకటి అడుగుతా ఇస్తావా?" అంది ముద్దుముద్దుగా.

ఏమిటన్నట్లుగా చూశాడు.

"ఇవ్వాల..." అతని కళ్లల్లోకి గోముగా చూస్తూ అంది.

"ఏందో చెబుతే గదా!" అన్నాడు.

"మా టీచర్ కాపీనోట్స్ తెచ్చుకోమన్నెది. తెచ్చిస్తావా?" అదే గోముతో అంది.

"నేనేడకు పోతండా తెచ్చీనీకి...?"

"ఇరవై రూపాయలిస్చే టీచరే తెచ్చిస్చాదంట... లెక్కీబ్బా!"

వక్కాకు నోరు కదిలిస్తూ మనవరాలికేసి రెండు క్షణాలు తదేకంగా చూసి, "మీ నాయిన్నడుగు పో..." అన్నాడు.

"నాయన కాడ... నో మనీ..." నడుము కిలిస్తూ చేతులు వొతికెల వేసి తిప్పింది.

"సెనక్కాయలు అమ్మిన లెక్కా పత్తి అమ్మిన లెక్కా ఎట్టబోయిందంటా?"

సమాధానంగా రెండు చేతులు ముందుకు చాచి బైకు హ్యాండిల్ పట్టుకొన్నట్లుగా అభినయిస్తూ, 'బుర్ ర్... ర్..." మంటూ పదడుగులు అట్లా గుండ్రంగా తిరిగి వచ్చింది. పిడికిలి బిగించి బొటనవ్రేలు చాచి పైకెత్తి నోట్లోకి వంచుతూ ఏదో తాగుతున్నట్లుగా చూపించింది. డబ్బంతా తిరిగేందుకూ తాగేందుకే ఖర్చు చేస్తున్నాడని తన చిన్నిచిన్ని చేతులతో నటించి చెప్పింది. ఏడేళ్లు కూడా నిండని పాప తండ్రి అవ లక్షణాలను బాగా గుర్తుపట్టింది.

కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి రామయ్యకు.

తల పక్కకు తిప్పుకొని కళ్లు తుడుచుకొంటూ లోపలి చొక్కా జేబులో చేయి దూర్చి రెండు పదిరూపాయల నోట్లను తీసి మనవరాలికి అందించాడు.

నిమిషం కూడా అక్కడ నిలబడకుండా పొలాల దారిబట్టాడు.

"అబ్బా! గొర్రెను తోలప్పోవా?" వెనకనించి కేకేసింది మనవరాలు.

తలతిప్పి చూశాడు.

గోడ కింద మెత్తగా ముడుచుకొని పడుకొని వుంది గొర్రె. నిన్నటి నుంచి మబ్బు కేసికొని వుంది.

"మీ అమ్మకు చెప్పు- పిడికెడు గడ్డిపోచలు దాని ముందర యిదిలించమని..." మనవరాలికి కేకేసి ముందుకు కదిలాడు.

నడివీధిలో రాజకీయాల గురించి గప్పాలు కొడుతూ వున్న కొడుకు గొంతు వినిపించింది.

'ఛూ వాని బతుకుజెడ... పొరంబోకు నా కొడుకు...' మనస్సులో కసిగా తిట్టు కొంటూ వూరు దాటాడు.

ఇల్లు విడిచి వెళ్లిపోవాలని ఏడాది కిందటే ప్రయత్నించాడు. కుదురుకోలేదు. మనస్సు మొండికేసింది.

వారం రోజుల కిందట జరిగిన ఒక సంఘటనతో యీనాటికి మనస్సు తెగింది.

ఇల్లు విడిచి వెళ్లిపోతూ వున్నాడు.

ఇంటినీ, వూరినీ, పొలాల్నీ వదిలేసి దూరంగా పోవడానికి సిద్ధమయ్యాడు.

పుట్టింది మొదలు యీ మట్టిలోనే పెరిగి, నాగటిచాళ్లల్లో ఆడుకొని, గొర్రె మీద కూచుని, ఎద్దుల గిట్టల వెనక అడుగులేసి, జడిగాల మీద పిడికిళ్లు మోపి, పైరు మధ్య తిరిగి, ధాన్యపు కళ్లాల్లో దొర్లాడి, పశువులు పక్షుల సావాసంగా రేయింబ వళ్లు యీ మట్టిలోనే బతికిన తను దాన్ని వదిలిపోవాలంటే ఒక భంగిన మనస్సు తెగిరాలేదు. నాలుగు చెంబుల నీటితో ఒంటిమీది మట్టిని కడుక్కొన్నంత సులభం కాదుగదా పొలంతో అనుబంధం తెంచుకోవడం! ఆ మట్టి నరనరాల్లో పేరుకుపోయి వుంటుంది.

కాలిదారి వెంట నడుస్తూ వున్నాడు.

అది చేలగట్ల మీదుగా వెళుతూ వుంది.

చేల దగ్గరకు వెళ్లినట్లే, చూసినట్లే... ఎవరికీ అనుమానం రాకుండా అట్నించటే రోడ్డెక్కాలనుకొన్నాడు. ఏదొక బస్సు పట్టుకొని దూరంగా వెళ్లాలి. అటు కర్నూలో, అనంతపురం జిల్లాలకో వెళ్లి కాశినాయన సత్రాల వద్ద కుదురుకొని శేషజీవితాన్ని అక్కడ స్వామి ఆవుల కాసేందుకో, అన్న సంతర్పణకో వినియోగించాలని నిర్ణయించు కొన్నాడు.

లోపలి చొక్కాలోంచి ఏదో ఊపముల్లులాంటిది గుచ్చుకొంటూ వుంది. పై చొక్కా విప్పితేగాని దాన్ని తొలగించలేడు.

చేలకాడ, గెట్లకాడ, చెట్లకాడ, మడవకాడ ఎన్నిసార్లు కొట్లాడి వుంటాడు ఇరుగు పొరుగులతో. ఏమారితే చాలు గెట్లు దున్నుతారు. చేలో పైరు మేపుతారు. అడ్డంగా నడుస్తారు. మడవ తిప్పుకొంటారు. తనకు సంబంధించిన మట్టిని కాపాడుకోడానికీ, మట్టిలోంచి నాణ్యమైన పంట దిగుబడిని సాధించడానికీ జీవితాంతం పోరాడుతూనే వున్నాడు. అలాంటివాడు ఇప్పుడు ఆ మట్టిని వదిలిపోతున్నాడంటే చూసేవాళ్ల దృష్టిలో చులకన అవుతాడు.

అందుకే ఎవరికీ ఏ అనుమానమూ రాకుండా వెళ్లిపోతున్నాడు.

విషయం తెలిస్తే వూరు వెళ్లనివ్వదు.

కొడుకు అడ్డుకోకపోవచ్చు. కోడలు లబలబలాడుతుంది. పిల్లలిద్దరూ చెరో కాలు కరచుకొని అడుగు ముందుకు వేయనీయరు.

అన్నిటికీమించి కోడలి కన్నీళ్లు తన కాళ్లకు సంకెళ్లు వేస్తాయి.

అందుకే మారుపంచె మారుచొక్కా సంచిలో పెట్టుకు రాలేదు. పైన తొడుక్కొని వెళుతున్నాడు.

ఊరి గమిల్లోనే గొల్లోల్ల గురప్ప ఎదురవగానే ఇంటి వద్ద మబ్బుకేసికొని వున్న గొర్రె గుర్తుకొచ్చింది.

"ఏం మామా! యాడికో బిర్రున పయనమైపోతుండావే?" అడిగాడు గురప్ప.

"సేనికాడికి లేవోయ్."

నమ్మలేనట్లుగా చూశాడు.

"సరేగాని... గొర్రె మెత్తబడిండాది. నిన్నట్నించి మొబ్బుకేసుకోనుండాది. అట్టా పోయి రోంత సూడోయ్! ఆకో, యీకో, వాతో, కోతో ఏదొక వైద్దెం సెయ్యి. సూదిమందు వుంటే చెయ్యి... మా కోడల్నడుగు లెక్కిస్చాది..." చెబుతూ ముందుకు నడిచాడు.

గురప్ప అతనికేసి అదోలా చూశాడు.

తలకు నూనె రాసి, నున్నగా అణగ దువ్వి, ఉతికిన పంచె గోచిజెక్కి, మరకల్లేని చొక్కా తొడిగి, నోటినిండా, వక్కాకు నములుతూ దారిబట్టినాడంటే... చేనికాడికని చెబితే మాత్రం నమ్మేదెట్లా?

రామయ్యకు సంబంధించిన లోపలా బైటా వుండే ఎగుడుదిగుడు జీవితాన్నంతా ఒకసారి అటు ఇటు తిప్పి చూశాడు గురప్ప. చెప్పిన మాట వినటం లేదని కొడుకు మీద ఎక్కసగా వున్నాడు. అట్లనీ కూతురు దగ్గరకు పోయేందుకు ఆమె కూడా ఎడమొగం పెడమొగంగానే వుందని వినికిడి. టౌనుతో యీనకేమీ పనిలేదు. మరి ఎక్కడికి వెళుతున్నట్లు?

పల్లె జీవితంలో ఒకరి రహస్యాలు మరొకరికి తెలియకుండా వుండవు గదా! తనకు తెలియని రహస్యాలు ఏమున్నాయని?

తల గీరుకొంటూ ఇంటిదారి పట్టాడు గురప్ప.

రామయ్య వంకలోకి దిగి ఎక్కగానే మాల ఏసేబు కనిపించాడు, రెండు మేక మరకల్ని కలపచెట్ల మీదకు ఎగమల్లించి మేపుకొంటూ.

"ఏమబ్బో! యాడికో పయనమయినావే?" అన్నాడు రామయ్యను చూస్తూనే.

అతనికేసి కొంత అసహనంగా చూశాడు రామయ్య.

వంకగట్టు ఎక్కుతానే కాలిదారి వదలి గట్టువెంట కంపచెట్లల్లో దూరి బాట దాకా నడిచి తార్రోడ్డు మార్గం చేరాలనుకొన్నాడు.

"చెరువు దిక్కు పోయినట్టు లేదు. నారుకయ్యల్నిండా నీల్లుండాయబ్బా! నారు కుల్లిపోతాది. సూసి గెట్లు తెంచుకో పో సామీ!" చెప్పాడు ఏసేబు.

అయోమయంలో పడ్డాడు రామయ్య.

వ్యవసాయంలో ఏ చిన్న పొరబాటునూ సహించని మనిషి తను. తెలిసి కూడా పట్టించుకోకుండా పోతే తను తనుగా లేనట్టే.

తను పారిపోతున్న విషయం పసిగట్టాడంటే తల ఎక్కడ పెట్టుకోవాలి? ఇన్నేళ్ల రైతుదనాన్ని ఏ వంక పారబోయాలి?

రైతుగానే ఇక్కడ్నించి దాటుకుపోవాలి.

నిట్టూరుస్తూ చెరువు దిక్కు కాలిదారి పట్టాడు.

చెరువు నీటివూటలు కయ్యనించి కయ్యకు పొర్లుతున్నాయి.

నారుకయ్యలో నీటిని తెంచి కాలువకు వదలి చేతులు కడుక్కొన్నాడు.

'వీధుల్లో పొరంబోకుగా తిరిగే బదులు పొద్దున్నే పొలాల దిక్కు వచ్చి కయ్యో, కాలవో, చెట్టో, గెట్టో చూసుకొనిపోవొచ్చు గదా!' అనుకొన్నాడు కొడుకు గురించి.

ఏడాది నుంచి ఎదురు తిరగటం మొదలుపెట్టాడు వాడు. మాటకు మాట అందిస్తున్నాడు. పని లేకున్నా టౌనుకు తిరగడం అలవాటుపడ్డాడు. దానికితోడు తాగుడు కూడా మొదలుపెట్టాడు. దొరికిన కాడల్లా అప్పు చేస్తున్నాడు. తిండిగింజలు పండే పంట చాలించి రూపాయలు పండే పంటలు సాగుజేస్తున్నాడు. కరువుగాలాల్లో వానలు బిగదీసి బోరుబావులు ఎండి ఒక్క తడి నీల్లు తక్కువైనా పెట్టుబడులు కూడా రానంత నష్టం. 'వద్దురా,' అంటే వినడు. పసుపు నాటుతానంటాడు. లక్షల్లో పెట్టుబడి. కొఱ్ఱ, సజ్జ విత్తుదామనీ, తిండిగింజలు గొడ్లమేపూ దక్కుతాదనీ చెబితే పట్టించుకోడు. 'అప్పులన్నీ ఎట్లా తీరాల?' అంటాడు. మొన్న తొలకరింపుల్లో బోరుబావి కింద దున్ని కొఱ్ఱ విత్తబోతోంటే కొట్టేందుకు మీదకొచ్చాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు... ఆరోజే మనస్సు తెగింది.

ముసల్ది కాలమైపోయి అదృష్టవంతురాలు. తనే రోగమూ రొస్టూ లేకుండా సంఱ్ఱకొయ్య మాదిరి నిలబడి అగచాట్ల పాలవుతున్నాడు.

నోట్లోని వక్కాకు అవశేషాన్నంతా వుండలాగా చేసి నేలమీద వూశాడు.

కాలువలో నీళ్లతో నోరు కడుక్కొని రెండు దోసిళ్లు తాగాడు.

పై గుడ్డతో తేమను తుడుచుకొని, గుడ్డను తలకు చుట్టుకొని దారిపట్టాడు.

పాలుమాలిన గొఱై కళ్ల ముందుకు రాబోతే దూరంగా తరిమాడు.

మనుమడు, మనవరాలు వచ్చి కమ్ముకోబోతే, గుడ్లురిమి బెదిరించాడు.

'నువ్వు బోతే మా గతి ఎట్ట మామా?' అంటూ కోడలు కన్నీళ్లు పెట్టుకోబోతే, 'పో పో పో... నీ మొగుడూ నువ్వూ ఏదొక అగసాట్లు పడండి,' అంటూ విసురుగా చెప్పి ముందుకు కదిలాడు.

పొలమూ, పైరూ, బర్రెలూ, కోళ్లూ, సంసారమూ, చుట్టాలూ ఎందరు అడ్డొచ్చినా ఆగలేదు. మనస్సు దిటవు చేసుకొన్నాడు. అన్ని దృశ్యాల్నీ అరచేత్తో తుడిచి వేస్తూ ముందుకు నడుస్తూ వున్నాడు.

ఉన్నట్టుండి ఎద్దు ఎదురొచ్చింది.

గాట్లో గడ్డి అయిపోతే తొక్కులాడి, మోర విదిలిస్తూ గడ్డి తీసుకురమ్మని సాధికారికంగా హెచ్చరించే ఎద్దు. కాడిమాను ఎత్తగానే తనకై తనే వచ్చి మెడ దూర్చే ఎద్దు ఎదురొచ్చింది. దీనంగా చూస్తూ వుంది.

ఉలికిపాటుగా అటుకేసి చూశాడు రామయ్య.

ఆలోచనల్లో కాదు- నిజంగానే ఎదురుగా తన ఎద్దు.

దారిపక్క చేలో పోటీదారుడు సుబ్బారెడ్డి చేతికింద దున్నుతూ వుంది.

తనను చూడగానే కాడి నిలబెట్టి ముందుకు వచ్చి పందకం సరిజేయ బోయాడు సుబ్బారెడ్డి.

జరిగిన మోసాన్ని వెంటనే పసిగట్టాడు రామయ్య.

తన ఎద్దు మీద వేలెడు బెత్తెడు కాదు జానెడు పైగా పర్రేసి దున్నుతున్నాడు అతను. బరువంతా దానిమీదకే జరిపి యీడిపిస్తున్నాడు. వాడి ఎద్దు సులభంగా నడుస్తూ వుంది. తన ఎద్దు ముక్కి ముక్కి యీడుస్తూ వుంది. గసపెడుతూ వుంది.

కోపం రవరవ ఎగదోసుకొచ్చింది రామయ్యకు.

"ఒరే సుబ్బిగా! నువ్వు మాసివా గొడ్డువా?" అన్నాడు ఎద్దులాగే బుసగొడుతూ.

సుబ్బారెడ్డికి అర్థమైంది.

"పందకం సల్లుబారి రొంత ఆ పక్కకు జరిగిందిలే సిన్నాయనా!" అన్నాడు సంజాయిషీ ఇచ్చే ధోరణిలో.

"సల్లుబారితే ఒక వేలెడు జరుగుతాది. పందకమంతా నడిచీలను దాటుకొని ఇవతలకొస్చదా? దొంగనాకొడుకువురా నువ్వు. నోరునొయ్యి లేని జీవాన్ని నమ్మకంగా కాడిగట్టి ఇస్చే దాని పానాలు తీస్చావా? నీ ఎద్దులాంటి పానంగాదా దాని పానం? కాపోనివంటరా నువ్వు? కసాయోనివిరా. నన్ను జూసి ఆదరాబాదరా వార్నె సరిజెయ్య డానికి వస్చాండవే- దొంగబుద్ధిగాదూ?" అంటూ పెద్ద గొంతుకతో అరిచి దండించాడు.

ఏదో సంజాయిషీ ఇవ్వబోతున్నాడు సుబ్బారెడ్డి.

"ఛ మాట్లాడొద్దు. కాడి విప్పు నా ఎద్దును నా ఇంటికి తోలు. నీ పోటీ వద్దు, నువ్వొద్దు... ఎద్దు కాడికి వచ్చినావంటే మర్యాదుండదు," అంటూ గద్దించాడు.

సుబ్బారెడ్డి తలొంచుకొన్నాడు.

అప్పటికే తన పరిస్థితి ఏమిటో స్ఫురణకు వచ్చింది రామయ్యకు.

అయినా ఎద్దు పడిన కష్టాన్ని చూసి సహించలేకపోయాడు.

మరో రెండు తిట్లు తిట్టి అక్కన్నించి కదిలాడు.

తన పని తనకే ఎబ్బెట్టుగా వుంది.

ఇల్లూ పొలాలూ వూరూవాడా వదిలిపెట్టి పోతున్నాడు. తనకెందుకు యీ గద్దింపులూ, కోపాలూ, తాపాలూ?

చూస్తూ ఉండలేకపోతున్నాడు.

తన ప్రవర్తన అట్లాకాకుండా మరోవిధంగా వుంటే జనాలకు అనుమానం వస్తుంది. వాళ్ల నుంచి దూరమయ్యేదాకా అలా వుండాల్సిందే.

చెరొక ఎద్దును పెట్టుకొని సుబ్బారెడ్డి, తను పోటీ సేద్యం చేసికొంటున్నారు.

నిన్న యీరోజు అతను దున్నుకొన్నాడు.

రేపు తన వంతు.

ఎవరు పోవాలి సేద్యానికి?

తను లేడని తెలిస్తే సుబ్బారెడ్డిగాడే దున్నుకొంటాడు. తన ఎద్దు మీద పఁరేసి దాని ప్రాణం తీస్తాడు.

ఎద్దును అమ్మేసి వూరు విడిచి వుంటే బావుండేది.

వక్కాకు కోసం పక్క జేబులో చేయి దూర్చబోతే లోపలి చొక్కాలోంచి భూమి పాసుబుక్కుల మోట్లు పొట్టలో పొడుచుకుంటున్నాయి.

పాసుబుక్కులు కొడుకు చేతిలో పడితే తాకట్టయినా పెట్టి తాగి తందనాలాడి పిల్లలకు ఏమీ లేకుండా చేస్తాడని భయపడి వాటిని కూడా వెంట తెచ్చుకొంటున్నాడు.

పై చొక్కామీంచే ముల్లు గుచ్చుకొనే చోట వేలితో తడిమి చూశాడు. చేతిని లోపలికి జొనిపి జాగ్రత్తగా ముల్లును పీకాడు.

లోపల ఆధార్ కార్డ్, వృద్ధాప్య పింఛన్ కార్డు కూడా వుంది.

అన్నింటికన్నా ఇబ్బంది పెట్టేది పింఛన్ కార్డే.

రేపు నెల నించి పెన్షన్ ఎవరు తీసికోవాలి?

పిల్లల పుస్తకాలకూ, చిన్న చిన్న ఖర్చులకు పెన్షన్ సరిపోయేది.

హఠాత్తుగా అప్పుడు గుర్తుకొచ్చింది మనవడు నాలుగు రోజుల క్రితం ఐదు వందల డబ్బు అడిగిన విషయం. పుస్తకాలు కొనుక్కోవాలంట. తండ్రిని అడిగితే అబ్బవైపు చేయి చూపాడుట.

ఈ నాలుగు రోజుల్నించి వాడు ప్రయత్నిస్తూనే వున్నాడుగాని తనే కావాలని ఆలస్యం చేశాడు. వాడేమో కళ్లనీళ్లు పెట్టుకొంటున్నాడు. వాడి తండ్రికి చీమ కుట్టి నంతయినా చురుకు తగలలేదు.

మనవడికి డబ్బులిచ్చి వెళ్లాలి.

పక్క వూర్లో బస్సు దిగి కిలోమీటరు దూరం నడిచి వస్తుంటారు- వ్యాను మోతను భరించలేని పిల్లలు. ఫ్రీ బస్‌పాస్ తీసుకొని వెళ్లి వస్తుంటారు.

సాయంత్రం వరకు వుండి, మనవడు బస్సు దిగే తావుకు వెళ్లి వాడికి డబ్బులిచ్చి అట్నించటే వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్నాడు.

"యాడికో దూరంగా పోతున్నెట్టుండావే?" పక్క చేలోని గంగన్న అడిగాడు.

"అదో... ఆ ఎర్రసేలదాకా..."

"కాదులే బావా! చొక్కా మీద చొక్కా వేసినావంటే వారం పదిరోజులన్నా నిలబడేట్టుండావులే..."

ఉలికిపాటుగా చొక్కా అంచులకేసి చూసికొన్నాడు.

వక్కాకు కోసం చేయి లోపలికి పెట్టినపుడు పైచొక్కా అంచులు మడిగాయి. వాటిని సవరించుకోకుండా వస్తున్నాడు. లోపలి చొక్కా కనిపిస్తూ వుంది.

సమాధానమివ్వకుండా చిన్నగా గొణుక్కొంటూ అక్కన్నించి కదలిపోయాడు రామయ్య.

తమ వూరి పొలాలు దాటి బరకలదాకా నడిచాడు.

చుట్టుపట్ల మేకల మందలుగాని గొర్రెల మందలుగాని లేవు.

దట్టంగా పెరిగి వున్న కలివె చెట్టు నీడన కూచున్నాడు.

పుల్ల తీసికొని నేలమీద పొడుస్తూ ఆలోచిస్తూ వుండిపోయాడు.

మధ్యాహ్నం కావొస్తూ వుంది.

కడుపులో ఆకలి కదలికలు మొదలయ్యాయి.

పొలాల దగ్గరుండుంటే కోడలు సంకటిముద్ద తెచ్చి పెట్టుండేది.

బరకల్లో వున్నాడు.

ఆకలి పెరుగుతూ వుంది.

కలివెపొద మొదట్లోకి అటుఇటు పరిశీలనగా చూసేసరికి బచ్చటాయి తీగ ఆకులు కనిపించాయి. ఆకుల్ని గిల్లి నమిలితే పుల్లపుల్ల రుచితో ఇంపితంగా అనిపించాయి. తీగ వెంట నేల మీద పుల్లతో తవ్వి చూస్తే చేతి గడయారం వెడల్పున గడ్డ కనిపించింది. చిరు చేదుతో, గెనుసుగడ్డలాంటి పిండి పదార్థంతో అదో రుచిగా వుంది.

తల కింద కండువా మడతబెట్టుకొని పడుకొన్నాడు.

కొద్దిసేపట్లోనే నిద్ర వచ్చింది.

లేచేసరికి మూడుగంటలు దాటింది.

లోపలిచొక్కా తడువుకొని చూసుకొన్నాడు.

ఒంటి మీదకు ఎక్కి వున్న ఒకటి రెండు గండుచీమల్ని విదిలించుకొని లేచాడు.

ఆకలిగా వుంది... నీరసంగా వుంది.

వంకలోకి దిగి కొంత దూరం నడచుకొంటూ పోతే నీళ్లగుండం కనిపించింది.

కడుపునిండా నీళ్లు తాగాడు.

చేలకు అడ్డంగా దారిబట్టి నడవసాగాడు.

గాలి ఆడటం లేదు. ఉక్కపోతగా వుంది.

లోపలి చొక్కాలోంచి చెమట వాసన ఎగిసివస్తూ వుంది.

అన్ని వదిలేసి రావలసింది. మారుచొక్కా అవసరం కాబట్టి చొక్కా మీద చొక్కా తొడుక్కొచ్చాడు.

దూరప్రాంతాలకు ఎద్దుల బేరం పోయేప్పుడు ఇదే పని చేస్తుంటారు. పై చొక్కా మాసినపుడూ, ఉతుక్కొనేందుకు అవకాశం లేనప్పుడూ లోపలి చొక్కా తీసి పైకి మార్చుకొంటారు.

ఇప్పుడు లోపలి చొక్కానే మాసి వుంది.

మూడురోజుల పొలం వాసనలూ, ఇంటి వాసనలూ, బఱ్ఱె గొఱ్ఱె ఎద్దు కోళ్ల వాసనలూ చొక్కాను అంటిపెట్టుకొని వస్తున్నాయి.

కాశినాయన ఆశ్రమానికి వెళ్లినపుడు మాసిన పంచె, చొక్కా ఉతుక్కొని సంచిలో పెట్టుకోవాలి.

నేరుగా బస్సు మార్గానికి వెళ్లాడు.

అక్కడ టీబంకు వద్ద అరకొరగా జనాలున్నారు. సాయంత్రానికంతా టీ, బజ్జీల కోసం, బీడీ సిగరెట్ల కోసం జనం గుమిగూడతారు.

బంకుకు కొంత ఎడంగా జువ్విచెట్టు కింది అరుగుమీద కూచున్నాడు.

పెనంలో మిరపకాయ బజ్జీలు కాలుతున్నాయి.

కడుపులో ఆకలి గోముగోముగా గోలజేస్తూ వుంది.

లెక్క ఖర్చుజేసి అలాంటి చిరుతిండ్లు తినటం అతనికి అలవాటులేదు.

బంకుకేసి చూడకుండా జేబులోంచి వక్కాకు తీసి తీరిగ్గా నోట్లో పెట్టుకొని నమలసాగాడు. చెక్కమొద్దు కొరుకుతూ వుంటే మాదిగ నరసింహులు అరుగు దగ్గరకు వచ్చాడు.

''రామయ్యా! ఆ దున్నపోతు దూడను యీగూడదా! ఎన్నిసార్లు అడిగినా పలికేట్టు లేవబ్బా! ఒకప్పుడు నేను నీ యింటి మాదిగోన్నేలే... రోంత గుర్తుదెచ్చుకో...'' అన్నాడు.

''యాడికీ లేకండా అడిగితే ఎట్టబ్బీ?'' అన్నాడు వక్కాకు అందిస్తూ.

''ఆజీబాజీ రేటు సూడు. ఒక వందన్నా తగ్గించుకోబ్బా!''

"వందగాదురా రొండొందలు తక్కవీ. ఎప్పుడో పదేండ్ల కిందటి రేటుకు అడుగుతే ఎట్టబ్బీ?"

"పండగపూట నీ పేరు జెపకొని తింటాములేబ్బా!"

"సరే... రేపు రాపోండి..." చెప్పాడు రామయ్య.

కొంతసేపు ఆమాట యీమాట మాట్లాడి బంకు దగ్గరకు వెళ్లాడు నరసింహులు.

తన ప్రవర్తన తనకే కొంత ఎబ్బెట్టుగా అనిపించింది రామయ్యకు.

'ఈ బేరసారాలు ఇంకా తను చేయటమేమిటి? నా కొడుకును అడుగు పోండి అని ఒక్క మాట చెబితే సరిపోతుంది గదా!'

వక్కాకు నములుతూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

కొంతసేపటికి బస్సొచ్చింది.

ఆలోచనల్నించి బైటపడి అరుగుమీంచి దిగాడు.

బస్సులోంచి బిలబిలమంటూ బడిపిల్లలు బైటికొస్తున్నారు.

మనవడికి డబ్బులిచ్చి అదే బస్సు ఎక్కి పోవాలనుకొన్నాడు.

పక్కపిల్లాడి చేతి ఆసరాతో బస్సు దిగుతూ వున్న మనవడిని చూడగానే నొసలు ముడివేశాడు.

కాలు కుంటుతూ వున్నాడు వాడు.

పుస్తకాల సంచి కిందబెట్టి నిస్సహాయంగా నిలబడ్డాడు.

గుండె లబలబలాడుతోండగా మనవడి కాళ్లకేసి చూస్తూ ముందుకు నడిచాడు రామయ్య.

కుడి మోకాలు తోలు లేచిపోయి ఎర్రగా కనిపిస్తూ వుంది.

"ఏమైంది నాయనా?" అంటూ ఆదుర్దాగా దగ్గరికి వెళ్లాడు.

"గ్రౌండులో ఆడుకుంటా కింద పన్నెలేబ్బా!" సంజాయిషీ ఇచ్చాడు.

వంగి కాలు పట్టుకొని చూస్తూ వున్న అబ్బ భుజాన పుస్తకాల సంచి వేశాడు.

అబ్బ వెంట అరుగుదాకా నడిచేసరికే ఇబ్బందిపడ్డాడు.

బస్సు కదిలి వెళ్లిపోతూ వుంది.

మనవణ్ణి ఎత్తు అరుగుమీద కూచోబెట్టి సంచిని అతని పక్కన వుంచాడు రామయ్య.

కాలు పట్టుకొని చూశాడు.

"మీ నాయనకు ఫోన్ చేయలేదా?" అడిగాడు.

"చేసినాబ్బా! ఆయనకేదో పనుందంట. ఎట్లనోకట్ల ఇంటికి పొమ్మన్నేడు," చెప్పాడు.

ఒళ్లు మండిపోయింది రామయ్యకు.

'పిల్లోల్లు కూడా కాబట్టనంత పనేం పనో?' మనస్సులో గొణుక్కున్నాడు.

తను లేకుంటే యీ పిల్లలు రాల్లురప్పల పాలయ్యేట్టున్నారు.

ఏదైనా మోటారుబైకు దొరుకుతుందేమోనని కొంతసేపు చూశాడు.

"చిన్నగా నడుచుకొంటూ పోదాంపాబ్బా!" చెప్పాడు మనవడు.

మరేమీ ఆలోచించలేదు రామయ్య.

మనవడి ముందుకెళ్లి వీపిచ్చి నిలబడి, "నన్ను కరచుకో..." అన్నాడు.

అబ్బ మెడకు రెండు చేతులు చుట్టి, రెండు కాళ్లను నడుముల చుట్టూ వేసి వీపు మీదకు వాలాడు వాడు.

పుస్తకాల సంచి చేతబట్టుకొని, మనవణ్ణి వీపుకు కరిపించుకొని వూరికేసి నడవసాగాడు రామయ్య.

పిల్లవాడి కాలిమడమ నొక్కుకుని లోపలి చొక్కాలోని పాసు పుస్తకాలు పొట్టలో గుచ్చుకొంటున్నాయి.

మనవడి కాళ్ల మట్టిమరకలు, నెత్తుటి మరకల్తో పైచొక్కా కూడా మాసిపోయింది.

*తానా సావనీర్ 'తెలుగు పలుకు'*
*జులై 2019*

*



16 ఫిబ్రవరి 1963న కడప జిల్లాలో పుట్టిన సన్నపురెడ్డి **వెంకటరామిరెడ్డి** మొదటి కథ ***కడితి వేట*** 1987 ఆంధ్రపత్రికలో అచ్చయింది. దాదాపు వంద కథలు రాశారు. *కొత్త దుప్పటి, బతుకు సేద్యం* కథా సంపుటాలు, ఆరు నవలలు ప్రచురించారు. కొన్ని కవితలు అచ్చయ్యాయి. *కాడి* నవలకు ఆటా బహుమతి, 2017లో *ఒంటరి*, 2019లో *కొండపొలం* నవలలకు తానా బహుమతులు లభించాయి.

**చిరునామా:** **బాలరాజుపల్లె, నరసాపురం పోస్ట్ కాశినాయన మండలం,**
**కడప జిల్లా - 516 217**
***ఫోన్: 94412 87865 sannapureddy12@gmail.com***